


బక్క రవీందర్
ఎడిటర్
సెల్: 8501919707



తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT








సంపుటి: 1 | సంచిక: 109 | పేజీలు: 4 | ఎడిటర్ : బక్క రవీందర్ | ప్రచురణ: హైదరాబాద్ | శుక్రవారం 29 -11-2024 | వెల: 5/రూ -


# పంచాయతీ భేరి!

## జనవరి 14న నోటిఫికేషన్..

## ఫిబ్రవరి రెండోవారంలో ఎన్నికలు

- 3 దశల్లో నిర్వహణ.. తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీలకు
- ఇద్దరు పిల్లలకు మించి సంతానం నిబంధన ఎత్తివేత
- సమగ్ర కులగణనపై డిసెంబరు 10 వరకు నివేదిక
- అనంతరం బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం
- కొన్ని మండలాల్లో పెరగనున్న ఎంపీటీసీ స్థానాలు
- రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు.. ఈలోపు రైతుభరోసా

హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర సర్కారు దృష్టిపెట్టింది. రానున్న సంక్రాంతికి ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసేందుకు ముమ్మర కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఫిబ్రవరి రెండో వారంలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా సర్పంచ్ ఎన్నికలను ఒకేరోజు జరిపితే ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని మొత్తం మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన సంగతి తెలిసిందే. సర్పంచ్ ఎన్నికలు ముగిశాక జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను నిర్వహించనుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా అభ్యర్థులకు 'ఇద్దరు పిల్లలకు మించి సంతానం' నిబంధనను ఎత్తివేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. రిజర్వేషన్లలో మార్పులు చేర్పులపైనా వేగంపెంచినట్లు సమాచారం. వీటికి సంబంధించిన నిబంధనలపై

2లో






# చంద్రబాబు పాలనలో సంపద ఆవిరైంది

కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆగ్రహం

17 మెడికల్ మెడికల్ కాలేజీలు, రూ.13 వేల కోట్లతో మూడు పోర్టుల నిర్మాణం

- భవిష్యత్‌లో వీటి వల్ల వచ్చే ఉద్యోగాలు, పెరిగే జీఎస్‌డీపీ, అభివృద్ధి
- తదితర అంశాల ద్వారా భారీగా పెరగనున్న సంపద..
- విద్య, వైద్య రంగాల్లో మేము తెచ్చిన విప్లవాత్మక చర్యల వల్ల కొన్ని తరాలకు లబ్ధి
- రూ.87,500 కోట్లు ఆవిరి చేసిన చంద్రబాబును సంపద సృష్టికర్త అంటారా?
- రూ. 1.10 లక్షల కోట్లు ఆదా చేసిన నన్ను సంపద సృష్టికర్త అంటారా?

అమరావతి: రాష్ట్రంలో సంపద సృష్టిలో భాగంగా విప్లవాత్మక అడుగులు వేశామని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. నిజమైన సంపద సృష్టి జరిగింది, రాష్ట్రానికి అదనపు ఆదాయాలు పెరిగింది, అదనపు ఆస్తులు సమకూరింది వైఎస్సార్ సీపీ హయాంలోనేనని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీతో కారుచౌకగా యూనిట్ రూ.2.49కే సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందం కుదుర్చుకోవడం రూ.1.10 లక్షల కోట్లను ఆదా చేసి సంపద సృష్టించామన్నారు.

2లో



# ప్రతీ పథకానికి రేషన్ కార్డు తప్పని సరి

- సూపర్ సిక్స్ పథకాలకూ కార్డు ఉండాల్సిందే
- ప్రతి ఒక్కరికీ సంక్రాంతిలోపు రేషన్ కార్డు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించింది. వాటిని అమలు చేయడానికి తగిన ప్రణాళికలను రూపొందించే పనిలో ఉంది. అయితే అంతకంటే ముందు ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

2లో

# తెరచాటు ఒప్పందం..



# లోక్‌సభలో కొత్త కళ

## గ్యాలరీ నుంచి వీక్షించిన సోనియా



- పార్లమెంటులోకి వస్తుండగా
- ఫొటోలు తీసిన అన్న రాహుల్‌గాంధీ
- ఇండియా కూటమిలో చిచ్చు!
- కాంగ్రెస్‌కు రబ్బర్ స్టాంపుగా ఉండం
- పార్లమెంటు స్తంభనపై మమత ఆగ్రహం
- అతివిశ్వాసంతోనే మహారాష్ట్రలో ఓటమి
- అనంతరరం యథావిధిగా విపక్ష సభ్యుల నినాదాలు
- సభను వాయిదా వేసిన స్పీకర్


న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేతలు ప్రియాంక, రవీంద్ర వసంత్ రావు చవాన్ గురువారం లోక్‌సభ సభ్యులుగా ప్రమాణం చేశారు. కేరళలోని వయనాడ్ నుంచి ప్రియాంక, మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి రవీంద్ర ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రియాంక విజయంతో నెహ్రూ–గాంధీ కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్య లు సోనియా, రాహుల్, ప్రియాంక పార్లమెంటులో ప్రవేశించినట్లయింది. కేరళ సంప్రదాయానికి చెందిన కసావూ చీర ధరించిన ప్రియాంక పార్లమెంటులో ప్రవేశించినప్పటి నుంచీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎంపీలతో పాటు మీడియా ప్రతినిధులు తన వెంట నడుస్తుండగా.. పార్లమెంటులోకి ప్రవేశిస్తున్న ప్రియాంకను సోదరుడు రాహుల్ గాంధీ తన మొబైల్‌లో ఫొటోలు తీశారు. ప్రియాంక రాజ్యాంగం చేతబూని, హిందీ లో ప్రమాణ స్వీకారం చేస్తుండగా

2లో

# 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం

## కీలక బిల్లును ఆమోదించిన ఆస్ట్రేలియా పార్లమెంటు

- జాబితాలో యూట్యూబ్‌కు మాత్రం మినహాయింపు
- వయసు ధ్రువీకరణ బాధ్యత సంబంధిత వేదికలదే
- ఉల్లంఘిస్తే రూ.280 కోట్ల జరిమానాలు
- పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం రీత్యా నిర్ణయం
- తల్లిదండ్రులు మద్దతివ్వాలి: ప్రధాని అల్బనీస్




2లో

# పల్లెల్లో ఇథనాల్ చిచ్చు!

## రాష్ట్రంలో ఇథనాల్ బ్లెండింగ్ పరిశ్రమలపై వ్యతిరేకత

## కాలుష్యకారక పరిశ్రమలు వద్దంటూ రైతుల ఆందోళన

- తమ ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందంటూ నిరసనలు
- ఇప్పటికే చిత్తనూరులోని జూరాల ఆర్గానిక్ ఫార్మ్‌లో ఇథనాల్ తయారీ
- మక్తల్, గద్వాలలో నిర్మాణం ప్రారంభం.. మరికొన్నిచోట్ల సన్నాహాలు
- కాలుష్యం వెలువడుతోందంటూ రైతు కమిషన్‌కు ఫిర్యాదులు





# ఇక నాపై కేసులు నమోదు చేయొద్దు!

హైకోర్టుకు రాంగోపాల్ వర్మ..

విచారణ వాయిదా

2లో

# తెరచాటు ఒప్పందం..

### కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం.. ఒకరు గిల్లితే.. మరొకరు ఏడ్చినట్లుందని ఎద్దేవా

### బీఆర్ఎస్ మాదిరిగా బీజేపీ డ్రామాలు చేయదు, అబద్ధాలు చెప్పదు

### 'కారు' షెడ్డులో ఉన్నా.. దాని తాళాలు 'చేతి'లోనే: బండి సంజయ్

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: గురివింద చందంగా బీఆర్ఎస్ పార్టీ తీరు ఉందని.. ఆ పార్టీ విధానాన్ని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన వారిని కాంగ్రెసలోకి.. చేతి గుర్తుపై గెలిచిన వారిని గులాబీ పార్టీలోకి పంపించుకుని మంత్రిపదవులు తీసుకున్నారని.. అప్పుడు ఎవరు ఎవరితో కలిసినట్లు? అనే విషయాన్ని కేసీఆర్ చెప్పగలరా? అని ట్విటర్ వేదికగా ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ తెరచాటు ఒప్పందంతో కలిసి పనిచేస్తున్నాయని.. బయటకు మాత్రం మేం గిల్లినట్లు చేస్తాం.. మీరు ఏడ్చినట్లు చేయండి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ మోసపూరిత విధానాలను అనుసరించిందని, వాటినే ఏడాదిగా కాంగ్రెస్ పాటిస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ వంటి కుంభకోణాలు, కేసుల విషయంలో పురోగతి లేకపోవడమే ఎవరితో ఎవరు కలిసున్నారనేది చెబుతోంది? రైతులను మోసం చేయడంలో, నిరుద్యోగ యువతను నడిరోడ్డుపై నిలబెట్టడంలో, ప్రజల మధ్య గొడవలు పెట్టి రెచ్చగొట్టడంలో, హిందూ సమాజాన్ని నిట్టనిలువునా చీల్చడంలో, కుటుంబ పాలనను ప్రోత్సహించడంలో, అవినీతిని పెంచి పోషించడంలో.. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల ఆలోచన, పరిపాలనలో సారూప్యత ఉందని ఆరోపించారు.ఎవరు, ఎవరి చేతుల్లో ఉన్నారో, ఎవరు సంగీతం వాయిస్తే.. ఎవరు డ్యాన్స్ చేస్తున్నారో ప్రజలకు ఈపాటికే అర్థమైపోయిందని పేర్కొన్నారు. కాగా బీఆర్ఎస్ పార్టీ మాదిరిగా బీజేపీ డ్రామాలు చేయదని, అబద్ధాలు చెప్పదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. 'బీజేపీ, కాంగ్రెస్ ఎప్పటికీ కలువబోవని చిన్న పిల్లాడిని అడిగినా చెబుతాడు. ఆ మాత్రం పరిజ్ఞానం కూడా ట్విట్టర్ టిల్లుకు లేకుండాపోయింది' అని ఎద్దేవా చేశారు. 'కారు' షెడ్డులో ఉన్నా, దాని తాళాలు ఎవరి 'చేతి'లో ఉన్నాయో అందరికీ తెలుసని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ట్విటర్ వేదికగా వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన కుంభకోణాలపై దర్యాప్తు మందగించడం బీఆర్ఎస్, కాంగ్రెస్ రహస్య ఒప్పందంలో భాగమేనని ఆరోపించారు. ధరణి, గొర్రెల పంపిణీ, కాళేశ్వరం, విద్యుత్తు కొనుగోలు కుంభకోణాలు సహా ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్, జన్వాడ ఫాంహౌజ్ కేసులపై దర్యాప్తు ఎందుకు నిలిచిపోయిందో అందరికీ అర్థమైపోయిందని సంజయ్ పేర్కొన్నారు.

# 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియా పార్లమెంటు గురువారం రాత్రి మైలురాయులాంటి నిర్ణయం తీసుకొంది. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని 16 ఏళ్లలోపు పిల్లలకు సామాజిక మాధ్యమాలను నిషేధిస్తూ బిల్లును ఆమోదించింది. పిల్లల వయసు ధ్రువీకరణకు సామాజిక మాధ్యమాల వేదికలే 'హేతుబద్ధమైన చర్యలు' తీసుకోవాలని సూచించింది. ఇందుకు ఏడాది గడువు ఇచ్చింది. ఆ ప్రక్రియ అంతా పూర్తయిన తరువాత వచ్చే ఏడాది నవంబరు నుంచి ఈ నిషేధం అమల్లోకి రానుంది. ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, టిక్‌టాక్, స్నాప్‌చాట్, రెడిట్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారంలకు ఇది వర్తిస్తుంది. ఈ జాబితాలో యూట్యూబ్‌ను మాత్రం చేర్చలేదు. వయసు నిబంధనను చాలా కఠినంగా అమలు చేయాలని ప్రభు త్వం నిర్ణయించింది. వయసును ఏ విధంగా నిర్ణయించాలన్న బాధ్యతను సామాజిక మాధ్యమాలకే విడిచి పెట్టింది. సామాజిక మాధ్యమాల్లో పిల్లలు ఖాతాలు ప్రారంభించకుండా నిరోధించలేకపోతే సంబంధిత వేదికలకు 50 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్లు (సుమారు రూ.280 కోట్లు) జరిమానాగా విధించనుంది. ఇందుకు సంబంధించిన బిల్లును ఎగువ సభ సెనేట్ ఆమోదించింది. ఈ విషయంలో అధికార లేబర్ పార్టీకి ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ సంపూర్ణంగా మద్దతు తెలిపింది. దిగువ సభ అయిన హౌస్ ఆఫ్ పీపుల్స్ రిప్రజెంటేటివ్స్ బుధవారమే ఆమోదించడం గమనార్హం. ఈ సందర్భంగా ప్రధాని ఆంటోనీ అల్బనేసే మాట్లాడుతూ విపరీతంగా సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్న కారణంగా పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం ప్రభావితమవుతోందని, అందువల్లనే నిషే?ధాన్ని విధిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు తల్లిదండ్రులు కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. మే నెలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయన తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యతను సంతరించుకొంది. పిల్లల వయసు నిర్ధారణకు బయోమెట్రిక్‌ను ఉపయోగిస్తారా, ప్రభుత్వం ఇచ్చే ధ్రువపత్రాలను వినియోగిస్తారా అన్నది తేలాల్సి ఉంది. ఈ విషయమై పలు సామాజిక మాధ్యమాలు పార్లమెంటుకు తమ అభిప్రాయాలు తెలిపాయి. వయసు నిర్ధారణ ప్రయోగాలు పూర్తయ్యే వరకు అమలు ను వాయిదా వేయాలని గూగుల్, మెటా సంస్థలు కోరాయి. మరింతగా సంప్రదింపులు జరపాల్సి ఉందని టిక్‌టాక్ కోరింది. ఈ బిల్లుకు ఈ వారంలోనే ఆమోదం తెలిపిన సెనేట్ కమిటీ పలు షరతులు పెట్టింది. వయసు ధ్రువీకరణకు పాసుపోర్టులు, డిజిటల్ ధ్రువీకరణ వంటి వ్యక్తిగత సమాచారాన్ని అడగకూడదని సూచించింది.

## ప్రతీ పథకానికి రేషన్ కార్డు తప్పని సరి

చంద్రబాబు సర్కారు ఇప్పటి వరకు అమలు చేస్తున్న పథకాలు, లబ్ది పొందుతున్న వారికి కొత్త కండీషన్ పెట్టింది. ఇకపై రాష్ట్రంలో స్టూడెంట్స్‌కి ఫీజ్ రీయింబర్స్‌మెంట్, గృహిణులకు దీపం-2 పథకం వర్తింపజేయాలన్నా..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు రేషన్ కార్డు కలిగి ఉండాలని ఏపీ ప్రభుత్వం తేల్చి చెప్పింది. అర్హులైన వాళ్లలో రేషన్ కార్డులు లేని వారికి సంక్రాంతిలోగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లుగా తెలుగుదేశం పార్టీ వెబ్ సైట్లో పెట్టడం జరిగింది. ప్రభుత్వం ఏదైనా సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే దానికి సంబంధించి ఎవరు అర్హులు అనే విషయాన్ని గుర్తించడం ముఖ్యం. అందుకే ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఇప్పుడు మరో నిర్ణయం తీసుకుంది.రాష్ట్రంలో ఫించన్ తీసుకునే వాళ్ల దగ్గర నుంచి ఫీజ్ రీయింబర్స్‌మెంట్ విద్యార్థులు, దీపం-2 పథకం లబ్దిదారులు తప్పని సరిగా రేషన్ కార్డు కలిగి ఉండాలని నిర్ణయించింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవి కావాలన్నా రేషన్ కార్డు తప్పనిసరి. ఏపీలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్రాంతి లోపు రేషన్ కార్డు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించినట్లుగా టీడీపీ వెబ్ సైట్లో పెట్టడం జరిగింది.

# పల్లెల్లో ఇథనాల్ చిచ్చు!



(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: పెట్రోలియం దిగుమతుల భారాన్ని తగ్గించుకోవడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్' తెలంగాణ పల్లెల్లో చిచ్చు పెడుతోంది. పెట్రోల్‌లో కలిపేందుకు అవసరమైన ఇథనాల్ తయారీ కోసం కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున యూనిట్ల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. చెరుకు నుంచి చక్కెర తీయగా మిగిలే మొలాసిస్, ధాన్యం నుంచి అవి ఇథనాల్‌ను తయారు చేస్తాయి. అయితే రాష్ట్రంలో ఈ యూనిట్ల ఏర్పాటుకు స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఏడాది క్రితం నారాయణపేట జిల్లా చిత్తునూరులో స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. తాజాగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ ఫ్యాక్టురీ నిర్మాణంపై స్థానికులు తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేపట్టడంతో.. పనులు నిలిపివేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కాలుష్య రహితంగా (జీరో లిక్విడ్ డిశ్చార్జి) ఏర్పాటు కావాల్సిన ఇథనాల్ ఫ్యాక్టరీలు నిబంధనలు పాటించట్లేదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఇథనాల్ ఫ్యాక్టరీలు వాయు, జల కాలుష్యానికి కారణమై తమ ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందంటూ చిత్తనూరు, దిలావర్‌పూర్ ప్రాంత వాసులు ఆందోళనలు చేపట్టారు. విదేశాల నుంచి శిలాజ ఇంధనాల దిగుమతిని తగ్గించడం, విదేశీ మారక ద్రవ్యాన్ని పొదుపు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం 2018లో నేషనల్ బయో ఫ్యూయల్ పాలసీని ప్రవేశపెట్టింది. 2025%-%26 నాటికి మొలాసిస్ లేదా ధాన్యం నుంచి ఏటా 1,080 కోట్ల లీటర్ల ఇథనాల్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో తెలంగాణకు 43 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించింది. ఇథనాల్ యూనిట్ల ఏర్పాటుకు ముందుకొచ్చే సంస్థలకు 'ఇథనాల్ ఇంటరెస్ట్ సబ్‌వెన్షన్ స్కీమ్' కింద వడ్డీ రేటులో 4 శాతం నుంచి 50శాతం వరకు రాయితీ ఇస్తామని ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణలో ఇథనాల్ తయారీ యూనిట్ల ఏర్పాటుకు 31 సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. అందులో 2018 నుంచి 2022 మధ్యకాలంలో 28 సంస్థలకు అనుమతి ఇచ్చింది. మొత్తంగా రోజుకు 5,256 కిలోలీటర్ల (కేఎల్‌పీడీ) ఇథనాల్ తయారీ ప్రతిపాదనలను ఆమోదించింది. వీటిలో నారాయణపేట జిల్లా చిత్తనూరులో వీటిలో ప్రస్తుతం 400 కేఎల్‌పీడీ సామర్థ్యమున్న జూరాల ఆర్గానిక్ ఫార్మ్ ఒక్కటే నిర్మాణం పూర్తి చేసుకుని ఉత్పత్తి ప్రారంభించింది. జోగులాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో మరో ఇథనాల్ కంపెనీ నిర్మాణ పనులు ప్రారంభ దశలో ఉన్నాయి. జగిత్యాల జిల్లా ధర్మపురి, నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలోనూ యూనిట్ల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిసింది. అయితే కేంద్రం నుంచి ఆమోదం పొందిన సంస్థల్లో ఎన్ని నిర్మాణ పనులు ప్రారంభించాయనే సమాచారం తమ వద్ద లేదని అధికారులు చెప్తున్నారు. నేషనల్ బయో ఫ్యూయల్ పాలసీ కింద ఇథనాల్ తయారీ యూనిట్లకు ఇచ్చిన అనుమతులతో తమకు సంబంధం లేదని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. గతంలో ఉమ్మడి జాబితాలో ఉన్న ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్ (ఐడీఆర్ యాక్ట్) కేంద్ర ప్రభుత్వ జాబితాలోకి వెళ్లిపోయిందని... దీంతో అందులో అంతర్భాగమైన ఇథనాల్ తయారీపై తమకు సమాచారం లేదని అంటున్నాయి.

# చంద్రబాబు పాలనలో సంపద ఆవిరైంది

అధిక ధరలతో పీపీఏల ఒప్పందాల గుదిబండ వల్ల సీఎం చంద్రబాబు రూ.87,500 కోట్లు ఆవిరి చేశారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో 17 కొత్త మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టడంతోపాటు దాదాపు రూ.13 వేల కోట్లతో మూడు కొత్త పోర్టుల నిర్మాణాన్ని చేపట్టామని.. వైద్య కళాశాలలు, పోర్టులు భవిష్యత్తులో రాష్ట్రానికి రూ.లక్షల కోట్ల సంపద సృష్టించే ఆస్తులుగా మిగులుతాయని పేర్కొన్నారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు.సుస్థిర వ్యవసాయాభివృద్ధే లక్ష్యంగా, రైతుల జీవనోపాధులు పెంచడమే ధ్యేయంగా వ్యవసాయ పంపుసెట్లకు పగటి పూట 9 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేయాలన్న మా ప్రభుత్వ ఆశయాన్ని కేంద్రం సైతం అభినందించింది. రైతులకు మంచి చేస్తూ మీరు తలపెట్టిన ఈ గొప్ప కార్యక్రమానికి మా వంతు తోడ్పాటు అందిస్తామని చెప్పింది. ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు ఇస్తూ యూనిట్ విద్యుత్ అత్యంత చౌకగా రూ.2.49కే సరఫరా చేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదిస్తూ కేంద్ర సంస్థ సెకీ లేఖ రాసింది. నాడు ఆ ప్రతిపాదనకు నేను ఒప్పుకోకుండా ఉంటే ఇదే చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5తో కూడిన ఎల్లో బ్యాచ్ నాపై ఏరకంగా దుమ్మెత్తిపోసేవారో అందరూ ఒక్కసారి ఆలోచించండి. చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి నాపై ఇలా దుష్ప్రచారం చేయడం ధర్మమేనా? ఇంత తక్కువ ధరకు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి, ఏ ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. ఏ ఒక్కరూ చేయలేనిదాన్ని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేయగలిగింది. ఒక చరిత్ర సృష్టించాం. చరిత్రలో నిలిచిపోయే ఒప్పందం ఇది.

**రైతులకు హక్కుగా ఉచిత విద్యుత్ లక్ష్యంగా..**

రాష్ట్ర ప్రభుత్వం, డిస్కంల మీద భారం పడకుండా.. మరో 25 ఏళ్ల పాటు రైతన్నలకు ధోకా లేకుండా ఉచిత విద్యుత్తు అందించడంలో భాగంగా గతంలో ఎప్పుడూ చేయని విధంగా ఆలోచన చేశాం. 2020 నవంబర్‌లో 6,400 మెగావాట్లకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీజీఈసీఎల్) ఆధ్వర్యంలో సోలార్ పార్కులు రాష్ట్రంలో నెలకొల్పేందుకు టెండర్లు పిలిచాం. రూ.2.49 నుంచి రూ.2.58 చొప్పున విద్యుత్ సరఫరా చేయడానికి ఎన్టీపీసీ లాంటి పెద్ద పెద్ద సంస్థలు అందులో పాల్గొన్నాయి. దాదాపు 24 బిడ్లు దాఖలయ్యాయి. అయితే చంద్రబాబు అనే చంద్రగ్రహణం కారణంగా న్యాయ వివాదాలు తలెత్తి ఈ ప్రక్రియ ఆగిపోయింది.

## ఇక నాపై కేసులు నమోదు చేయొద్దు!

అమరావతి: సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై సామాజిక మాధ్యమాల్లో అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో ఇకపై ఎలాంటి కేసులు నమోదు చేయకుండా డీజీపీ, హోంశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించాలని కోరుతూ దర్శకుడు రాంగోపాల్ వర్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు వచ్చింది. పోలీసుల తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పాణిని సోమాయాజి స్పందిస్తూ... ఈ కేసులో అడ్వకేట్ జనరల్ హాజరై వాదనలు వినిపిస్తారన్నారు. విచారణను వాయిదా వేయాలని కోరారు. పిటిషనర్ తరఫు న్యాయవాది టి.రాజగోపాలన్ వాదనలు వినిపిస్తూ... ఒకే పోస్టుకు సంబంధించి పిటిషనర్‌పై వివిధ పోలీసుస్టేషన్లలో వరుస కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు.పోలీసులు నోటీసులు ఇచ్చి విచారణకు హాజరుకావాలని కోరుతున్నారన్నారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు నమోదు చేసిన కేసును ప్రధాన కేసుగా భావించి, తర్వాత నమోదైన కేసులను వాంగ్మూలాలుగా తీసుకోవాలని అభ్యర్థించారు.

# పంచాయతీ భేరి!

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి బిల్లుపెట్టి.. ఆమోదింపచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఏడాది జనవరి 31న సర్పంచుల పదవీకాలం పూర్తయింది. అయితే గత 10నెలలుగా పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే ఎన్నికలు జరపాలని పలు వర్గాల నుంచి డిమాండ్ వస్తున్నప్పటికీ.. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తిచేసి, స్థానిక ఎన్నికలు జరిపేవిధంగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఈ కమిషన్ సమగ్ర కులగణన పూర్తిచేసి.. డిసెంబరు 10నాటికి నివేదిక అందజేయనున్నట్లు తెలుస్తోంది. ఆ నివేదికను పరిశీలించిన అనంతరం బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకోవాలన్న ఉద్దేశంతో ఉంది. బీసీ రిజర్వేషన్లను ప్రభుత్వ పరంగా పెంచే అవకాశాలను పరిశీలించనుంది. ఒకవేళ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 50శాతం మించకూడదన్న నిబంధనను పాటించాల్సి ఉన్నందున.. ప్రత్యామ్నాయ మార్గంపై కూడా ఆలోచిస్తున్నట్లు సమాచారం. అలాంటి పరిస్థితిఉంటే.. పార్టీపరంగా బీసీలకు అధిక స్థానాలు కేటాయించి.. తామే అమలు చేశామని అధికార పార్టీ చెప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వానిదే తుది నిర్ణయమని.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్లు ఉంటాయని.. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తామని ఎస్‌ఈసీ గతంలో తెలిపింది. కాగా స్థానిక సంస్థల ఎన్నికలు మొదలయ్యేలోపు యాసంగి సీజన్ కోసం పెట్టుబడి సాయం కింద ఇచ్చే రైతు భరోసా పథకాన్ని పూర్తిచేయాలని సర్కారు భావిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 12,867 గ్రామపంచాయతీలు, 538 జెడ్పీటీసీ, 5,817 ఎంపీటీసీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాది జూలై 2న జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం ముగిసింది. సర్పంచ్ ఎన్నికల్లో పార్టీల గుర్తులుండవు! జెడ్పీటీసీ, ఎంపీటీసీలు మాత్రం పార్టీల గుర్తులతో ఎన్నికల్లో పోటీపడాల్సి ఉంటుంది.

# లోక్‌సభలో కొత్త కళ

(మొదటి పేజీ తరువాయి)

ఆమె తల్లి, రాజ్యసభ సభ్యురాలు సోనియా, భర్త రాబర్ట్ వాద్రా గ్యాలరీ నుంచి తిలకించారు. భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయతను పాటిస్తానని ఆమె ప్రమాణం చేసినప్పుడు రాహుల్, ఇతర కాంగ్రెస్ సభ్యులు బల్లలు చరిచి హర్షధ్వానాలు చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వయనాడ్ నియోజకవర్గం నుంచి ప్రియాంక 4,10,931 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు. దీంతో ఉత్తరాదిలోని రాయబరేలీకి రాహుల్ గాంధీ, దక్షిణాదిలోని వయనాడుకు ప్రియాంక ప్రాతినిధ్యం వహిస్తున్నట్లయింది. 1999 నుంచి రాజకీయాల్లో ఉన్న ప్రియాం క తొలుత తన తల్లి సోనియా నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికే పరిమితమయ్యారు. 2004లో సోనియాతో పాటు రాహుల్ నియోజకవర్గంలో కూడా ప్రచారం చేశారు. 2009లో ఆమెను అధికారికంగా తూర్పు ఉత్తరప్రదేశ్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా, 2020లో జాతీయ స్థాయిలో ప్రధాన కార్యదర్శిగా నియమించారు. దాదాపు పాతికేళ్లుగా రాజకీయాల్లో ఉన్న ప్రియాంక(52) తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలో నిలిచి, గెలిచారు. ప్రియాంక 1972 జనవరి 12న ఢిల్లీలో జన్మించారు. 1997లో ఆమె ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను పెళ్లి చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు రెహాన్, మిరయా ఉన్నారు.

**గందరగోళం, వాయిదా**

లోక్‌సభలో ఉదయం 11 గంటలకు ప్రి యాంక, రవీంద్ర ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అదానీ కుంభకోణం, సంభాల్ హిం సాకాండపై యథాప్రకారం గందరగోళం చె లరేగింది. ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి ప్రవేశించడంతో తొలుత 12 గంటలకు వాయిదా వేసిన స్పీకర్ ఓం బిర్లా తర్వాత శుక్రవారానికి వా యిదా వేశారు. అదానీ సంస్థకు వ్యతిరేకంగా వచ్చిన ఆరోపణలపై చ ర్చించాలన్న కాంగ్రెస్ సభ్యుల డిమాండ్‌ను స్పీకర్ అంగీకరించలేదు. ప్రశ్నోత్తరాల తర్వాత ఈ అంశంపై చర్చించవచ్చని స్పీకర్ చెప్పగా.. సభ్యులు అంగీకరించలేదు.

**కాంగ్రెస్‌కు రబ్బర్ స్టాంపుగా ఉండం: మమత**

మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు విపక్ష ఇండియా కూటమిలో లుకలుకలు రేపుతున్నాయి. కాంగ్రెస్ ఆధిపత్య ధోరణిపై పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినాయకురాలు మమతా బెనర్జీ గుర్రుగా ఉన్నారు. ముఖ్యంగా అదానీ వ్యవహారంలో ఏకపక్షంగా పార్లమెంటును స్తంభింపజేయడం ఆమె అసంతృప్తిగా ఉన్నారు. తమ రాష్ట్ర సమస్యలను ప్రస్తావించేందుకు సభలు సజావుగా నడవాలని ఆమె గట్టిగా కోరుకుంటున్నారు. ఇందుకోసం పార్లమెంటులో స్వతంత్రంగా వ్యవహరించాలని భావిస్తున్నారు.

# బాలికల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ వల్లూరు క్రాంతి

పాఠశాలలో అవసరమైన మరమ్మతులు వెంటనే చెప్పటాలని ఆదేశం.

ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడి

సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి





**పటాన్చెరు, నవంబర్ 28 ( డైలీ రిపోర్ట్) :** పటాన్ చెరు మండలం ఇంద్రేశం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న బీసీ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో కిచెన్ షెడ్డు, డైనింగ్ హాలు, స్టోర్ రూమ్, మూత్రశాలలు, మరుగుదొడ్లను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్ల కిటికీలు, డోర్ లకు అవసరమైన మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని ప్రిన్సిపల్ కు సూచించారు. భవనం యజమానితో మాట్లాడి పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. జిల్లాలోని అన్ని కస్తూరిబా పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తాసిల్దారులు, ఎంఈవోలు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందేలా చూడడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగు కోసం చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. భవనాల మరమత్తు పనులను ఆయా యజమానులతో అధికారులు మాట్లాడి వెంటనే చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు మేను ప్రకారం నాణ్యమైన భోజనం అందేలా చూడాలని, కాలం చెల్లిన వస్తువులు వాడకూడదని సూచించారు. వసతి గృహాలకు, గురుకుల పాఠశాలలకు సరఫరా చేసే బియ్యం నాణ్యతతో ఉండాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసీఓ కిరణ్ కుమార్, తహసిల్దార్ రాంబాబు, వసతి గృహ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పరమ పవిత్రమైన కార్తీకమాసంలో గిద్దలూరు శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో గంగమ్మ గౌరమ్మ ల పూజ లో పాల్గొన్నా గిద్దలూరు మండల టీడీపీ యూత్ నాయకులు బోధనబోయిన అరుణ్ యాదవ్ సతీమణి శ్రీ లక్ష్మీ పండితులు ఆశీర్వదించి అందించిన తీర్థప్రసాదాలను స్వీకరించడం జరిగింది. -గిద్దలూరు( డైలీ రిపోర్ట్) నవంబర్28



## మహాత్మా జ్యోతీ రావుపూలేకు ఘన నివాళులు

### అర్పించిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు బండి శ్రీనివాస్,బోధనబోయిన అరుణ్ యాదవ్

**గిద్దలూరు, నవంబర్ 28,( డైలీ రిపోర్ట్ ):** గిద్దలూరు నియోజకవర్గం గిద్దలూరు పట్టణంలోని విరంచి హాస్పిటల్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి గిద్దలూరు నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘము అధ్యక్షులు బండి శ్రీనివాస్, నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షులు టీడీపీ యూత్ నాయకులు బోధనబోయిన అరుణ్ యాదవ్ నివాళులర్పించారు గిద్దలూరు నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షులు టీడీపీ యూత్ నాయకులు బోధనబోయిన అరుణ్ యాదవ్ మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహానుభావుడు మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సంఘసంస్కర్త అని బోధనబోయిన అరుణ్ యాదవ్ మాట్లాడారు.గిద్దలూరు నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘము అధ్యక్షులు బండి శ్రీనివాస్ మాట్లాడుతూ 1873 లో పులే తన అనుచరులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ ను ఏర్పాటు చేసిన ఆశాజ్యోతి పూలే తన భార్య సావిత్రిబాయి పులే ని చదివించి భారతదేశంలో మహిళా విద్యకు పునాది వేసిన ఆదర్శవాది అని బండి శ్రీనివాస్ అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా వారి సేవలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళి అర్పించిన గిద్దలూరు నియోజకవర్గ ఉపాధ్యక్షులు మండ్ల శ్రీనివాసులు, ఇ కార్యక్రమంలో బీసీ నాయకులు సుండి రమణ ,శబోలు కాశన్న, పులిచారల రమణ యాదవ్, కలసపటి బలరామయ్య, దాసరి బాలయ్య, కడియాల లక్ష్మీ ,జంగిటి శివ, వెంకటస్వామి ,అబ్బయ్య, తొండమల్ల రాజేష్,బోయపాటి రమణ, తదితరులు పాల్గొన్నారు.

## చర్చి పేరుతో ప్రార్ధనలు, మతమార్పిడులు చేస్తే ఊరుకునేది లేదు: బిజేపి నాయకులు

**అమీన్ పూర్ నవంబర్ 28 (డైలీ రిపోర్ట్):** అమీన్పూర్ మండలం పటేల్ గూడా గ్రామ పరిధిలో బిహెచ్ఎల్ మెట్రో కాలనీలో ప్రైవేట్ బిల్డింగ్ లో ఎటువంటి పర్మిషన్ లేకుండా రోజు సాయంత్రం చర్చి అని చెప్పి ప్రార్ధనలు మతమార్పిడులు నిర్వహిస్తున్నందున వారికి ఇక్కడ ఈ ప్రార్ధనలు చర్చి నిర్వహించొద్దని మేము ఎంత చెప్పినా వినని పక్షంలో హిందూ బంధువుల అందరం కలిసి ప్రవేట్ బిల్డింగ్ ముందర హనుమాన్ శాలిస్ చేపట్టడం భజన కార్యక్రమాలు నిర్వహించాము. దానితో వాళ్ళందరూ వెనుతిరడం జరిగింది. ఇకముందు కూడా మరొక్కసారి ఇక్కడ చర్చి ప్రార్థనలు చేసినచో ఇంకా భారీ ఎత్తున హిందూ బంధువుల మందిరము కలిసి భజన కార్యక్రమాలు చేపడతామని చర్చి పెద్దలకు తెలియజేయడం జరిగిందన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో అమీన్పూర్ బిజెపి మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ వివిధ కాలనీ ల హిందూ బంధుమిత్రులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.



# ఆడపిల్లలు అధైర్య పడొద్దు

మగ పిల్లల కంటే ఎందులోనూ తక్కువ కాదు: ఆకునూరు మురళి, రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్.

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తో కలిసి వసతి సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీ పాఠశాలలు, సంగారెడ్డి ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హాస్టల్ తనిఖీ.

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన, విద్యా కమిషన్ చైర్మన్, కలెక్టర్లు.





**నవంబర్ 28 (డైలీ రిపోర్ట్):**ఆడపిల్లలు అధైర్య పడద్దని ఆడపిల్లలు మగవారి పిల్లల కంటే ఎందులోనూ తీసిపోరని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకులూరి మురళి అన్నారు. గురువారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా, మండల కేంద్రమైన కొండాపూర్ లోని కేజీబీవీ పాఠశాలను, కొండాపూర్ మండలం మల్లెపల్లి లోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని, సంగారెడ్డి హాస్టల్ గడ్డలోని ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హాస్టల్ ను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తో కలిసి తనిఖీ చేశారు ఈ సందర్భంగా సంగారెడ్డి ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హాస్టల్ లో కలెక్టర్ , విద్యా కమిషన్ చైర్మన్లు విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు కస్తూరిబా పాఠశాల సాంఘిక సంక్షేమ వసతి గృహాలు ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హాస్టల్ లలో వంట గదులు, స్టోర్ రూమ్ లు, డైనింగ్ హాలు, మూత్రశాలలో మరుగుదొడ్లు, గదులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం నేను ప్రకారం పెట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కస్తూరిబా బాలికల పాఠశాలలో విద్యార్థులతో విద్యా కమిషన్ చైర్మన్ మాట్లాడారు ధైర్యం చెందొద్దని పోటీపడి అనుకున్నది సాధించాలని,ఉన్నత లక్ష్యం ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్యాన్ని సాధించేవరకు విద్యపై దృష్టి సారించాలని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉన్నత పదవుల్లో ఉన్న ఎంతోమంది అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారే అన్నారు. సంక్షేమ వసతి గృహాలు ,సంక్షేమ గురుకుల పాఠశాలలో కేజీబీవీబీలలో భోజనాల తయారీ కోసం వినియోగించే కారంపొడి, అల్లం వెల్లుల్లి పేస్టు, పసుపు, గరం మసాలా, సాంబార్ పౌడర్ లాంటి పొడులను రెడీమేడ్ వి వాడవద్దన్నారు. ఇక్కడే తయారు చేసుకోవాలని సూచించారు. పది రోజులపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో సంక్షేమ వసతిగృహాలు, కేజీబీవీ పాఠశాలలు, సంక్షేమ గురుకుల పాఠశాలలో తనిఖీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ తెలిపారు. చలికాలంను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు వెంటనే బ్లాంకెట్లు , స్వెటర్లు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ను విద్యా కమిషన్ చైర్మన్ ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాలు సంక్షేమ గురుకుల పాఠశాలలో అవసరమైన మరమత్తు పనులు వెంటనే చేపట్టాలని సూచించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు విద్యార్థి సమస్యలపై ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదికను అందజేసి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నట్లు విద్య కమిషన్ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, సంగారెడ్డి తాసిల్దార్ దేవదాస్, వార్డెన్లు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



## దేశంలో కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు

# మహాత్మా జ్యోతిరావు పూలే

### పూలే గొప్ప సంఘసంస్కర్త, ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం


**మహిళల విద్య కోసం ఆయన ఎంతో పోరాటం చేశారు**

**సాంఘిక వ్యవస్థలో మార్పు కోసం పూలే కృషి**

**బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన సేవలు మరవలేనివి**

**మహిళా సాధికారతకు విద్య ఎంతో అవసరం అని భావించిన పూలే ఆ దిశగా మహిళా విద్యకు పాటుపడ్డారు.**

**అడ్వకేట్ సౌజన్య (సంగారెడ్డి జిల్లా)**



అడ్వకేట్ సౌజన



**సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 28 (డైలీ రిపోర్ట్):** సమసమాజా స్థాపన కోసం జ్యోతి రావు పులే సేవలు మరువలేనివి సంగారెడ్డి అడ్వకేట్ సౌజన్య అన్నారు. సంగారెడ్డి పట్టణంలో జ్యోతిరావు పులే 134వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంటరానితనం కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషిచేశాడని అన్నారు. బలహీన వర్గాలకు ఆదర్శమూర్తిగా జ్యోతిరావు పూలే నిలిచారని తెలిపారు. జ్యోతిరావు పూలే దేశానికి చేసిన సేవలను గుర్తుంచుకొని ఆయన బాటలో పయనించాలన్నారు. తన జీవితమంతా అణగారిన వర్గాల కోసం ఆశాజ్యోతిగా పసమసమాజా స్థాపన కోసం కృషిచేసాడని ఆయన సేవలు మరవలేనివని కొనియాడారు. మహిళా సాధికారతకు విద్య ఎంతో అవసరం అని భావించిన పూలే ఆ దిశగా మహిళా విద్యకు పాటుపడ్డారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పూలే దంపతులు అహర్నిశలు కృషి చేశారని అన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఆశయ సాధనకు పాటుపడాలన్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆయన అణగారిన వర్గాల కోసం చేసిన పోరాటం మరువలేనిదన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలో జన్మించాలని, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనునిత్యం కృషి చేసిన గొప్ప మహనీయుడని. జిల్లా కోర్టులో తదితర న్యాయవాదులు ఆయన వర్ధంతి సందర్భంగా స్మరించుకోని ఆ మహనీయునికి ఘనంగా నివాళులు అర్పించారు.

## 'నా కుమారుడికి సంబంధమే లేదు.. కాంగ్రెస్‌ది అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్'



హైదరాబాద్: దిలావర్పూర్ ఇథనాల్ ఫ్యాక్టరీ అంశంపై మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇథనాల్ కంపెనీతో తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. అలాగే, దీనిపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని మీడియాతో మాట్లాడుతూ..'ఇథనాల్ ఫ్యాక్టరీ అంశంలో నా కుమారుడికి సంబందం ఉందని పీసీసీ అధ్యక్షుడు, మంత్రి సీతక్క ఆరోపణలు చేశారు. ఇథనాల్ కంపెనీతో మా కుటుంబానికి సంబంధం లేదు. ఇథనాల్ కంపెనీ వద్దు అని అక్కడి గ్రామస్తులు ధర్నాలు చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలి. రాజమండ్రి దగ్గర ఒక డిస్టిలరీస్ కంపెనీలో 8 మంది డైరెక్టర్లలో ఒకరిగా నా కుమారుడు ఉన్నారు. 2016లోనే డిస్టిలరీస్ కంపెనీ డైరెక్టర్ గా నా కుమారుడు రాజీనామా చేశాడు. ఆ పేపర్లను పట్టుకుని మాపై అసత్య ప్రచారం చేస్తున్నారు. నా కుటుంబానికి చెందిన కంపెనీ అని నిరూపిస్తే మీకే కంపెనీని రాసిస్తాను. బీఆర్ఎస్ పార్టీపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారు. దిలావర్‌పూర్ గ్రామ ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి. రాజకీయాల్లో విమర్శలు.. ప్రతి విమర్శలు సహజం. ఇథనాల్ కంపెనీకి గత రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు. ఇథనాల్ కంపెనీ పర్మిషన్లు కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. లగచర్లలో కేటీఆర్ కుట్ర చేశారని ప్రభుత్వం ఆరోపణలు చేసింది. రాష్ట్రంలో అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం అయింది. రాష్ట్ర ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారు అంటూ కామెంట్స్ చేశారు.

# మత్స్యకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం..



**కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సమన్యాయం..**

**నీలం మధు ముదిరాజ్...**

**జిన్నారం నవంబర్ 28 (డైలీ రిపోర్ట్):** జిన్నారం మండలం ఊట్ల గ్రామం లో మత్స్య సంఘం భవనం ప్రారంభించిన నీలం మధు..మత్స్యకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం జిన్నారం మండలం ఊట్ల గ్రామంలో జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ సుంకరబోయిన మహేష్ గారి ఆధ్వర్యంలో మత్స్య సంఘం భవన ప్రారంభోత్సవం తో పాటు సత్యనారాయణ వ్రతం, కార్తీక మాస వన భోజనాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కులవృత్తుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. మత్స్యకారుల ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చెరువుల్లో చేపల పెంపకానికి చేప పిల్లల పంపిణీ ప్రక్రియను ప్రారంభించిందని, మత్స్యకారుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్తీక మాసం సందర్భంగా శివ కేశవులని పూజిస్తూ ఏర్పాటు చేసిన వన బోజనాలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వన బోజనాలు ఐక్యతను సూచించడంతో పాటు మనషుల మధ్య స్నేహభావం పెంపొదిస్తుందని తెలిపారు. మనం ఐకమత్యంగా ముందుకు కదిలితేనే సమాజంలో మన జాతికి గుర్తింపు లభిస్తుందన్నారు ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పులిమామిడి రాజు, జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్డే కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగు రమేష్,కాంగ్రెస్ నాయకులు ఎట్టయ్య, మండల అధ్యక్షులు నారబోయిన శ్రీనివాస్, గారెల మల్లేష్, మాణిక్యరావ్, లక్ష్మణ్ యాదవ్, వెంకటేశ్,అశోక్,గణేష్,వీరేష్, పూజరి రాజు, సాయి,శ్రీశైలం,రఘు, మహిళలు, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707